# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక




November 1993

# THE WORD OF TRUTH

# ఆహ్వానము

## కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

## 8వ గొప్ప బైబిల్ సెమినార్

ఉపన్యాసకులు : శ్రీ పెర్రి బి. కాతమ్, అమెరికా

శ్రీ జాన్ ఫోర్డ్, అమెరికా

తేదీలు : 1994 జనవరి 17 నుండి 21 వరకు

(సోమవారం నుండి శుక్రవారం వరకు)

సమయం : ప్రతి రోజు :

ఉదయం — 10 గం॥లు

మధ్యాహ్నం — 3 గం॥లు

సాయంత్రం — 6-30 గం॥లు

స్థలం : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆవరణలో

విద్యుత్ నగర్, ఐడియల్ కాలేజి సమీపాన

కాకినాడ - 533 003.

అన్ని సంఘముల బోధకులకు యిది ఒక ప్రత్యేక ఆహ్వానము. బోధింపబడుచున్న వాక్యము లేఖనానుసారముగా ఉన్నదో లేదో పరిశోధించుటకు మీకు ఇదొక గొప్ప సదవకాశము. ఉచిత భోజన, వసతి సౌకర్యము కలదు. మీరును, మీ మిత్రులును కలిసి రండి. మీకు మా ప్రత్యేక ఆహ్వానము.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 14 నవంబరు 1993 సంచిక 4


## సంపాదకీయము

### నిత్యజీవిత తృష్ణ

### ( Man's Longing for Immortality )

భూమిమీద మానవుల వయోపరిమాణము స్వల్ప కాలమే అయినను వారందరిలో సహజముగా ఒక కోరిక యున్నది. అది నిత్యము జీవించవలెననెడి కోరిక. చావు అనిన సహజముగ భయపడు వాడు మానవుడు. గోత్రికర్తయగు యోబు అలనాడెప్పుడో 'మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా?' యని ప్రశ్నించి తనలోయున్న నిత్యజీవిత తృష్ణను వెలిబుచ్చెను (యోబు 14:14). యోబు వేసిన ప్రశ్న మానవజాతి ఆరంభమైన నాటినుండి నేటివరకు వేయబడుచున్న ప్రశ్నయై యున్నది. హేబెలు చనిపోగా ఆదాము హవ్వలు, చివరకు కయీనుకూడ అతడు మరల బ్రతుకునా? యని ఆలోచించి యుండకపోరు. లక్షలకొలది మానవులు నేడు చనిపోవుచున్నారు గనుక

ఇది మనము తరుచు ఎదుర్కొనుచున్న ప్రశ్నయై యున్నది. మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా?' యని యోబు అడిగిన ప్రశ్న ఈనాడు మన ప్రశ్నయై యున్నది. గనుక మనందరము అమర్త్యతను (Immortality) వెదుకుచున్నామని ఒప్పుకొనక తప్పదు.

అయితే అమర్త్యత (Immortality) అనగా యేమిటి? ఒకడు మరణించిన తరువాత అతని ఆత్మ జీవించియుండుట లేక ఉనికిని కలిగియుండుట అమర్త్యత అని సాధారణముగ అందరు తలంచెదరు. అంటే ఒకడు మరణమొందగానే అతడు అంతమొంది యుండలేదు అని అందరు అంగీకరించుచున్నారు. ఇందు విషయమై బైబిలు చెప్పునదేమంటే—ఒకడు మరణించగా అతని ఆత్మ జీవించుచునే యుండును. సరిగదా ఒకానొక దినమందు అది నిత్యత్వము (Eternity) లో ప్రవేశించునపుడు శరీరముతో పునరుత్థానమగును. ఆత్మ శరీరముతో ఏకమై మరి ఎన్నటికి ఎడబాయకుండు నిమిత్తము లేపబడును. క్రైస్తవునికి ఇది బహు ధన్యకరమైన స్థితి యగును.

నిత్యజీవితము యదార్థమైనదని మానవులు నమ్ముటకు అనేక ఋజువు లున్నవి. పురాతన నాగరికతలను మనము పరిశోధించిన యెడల వేలకొలది సంవత్సరముల క్రితమున్న ప్రజలకు నిత్యజీవితమునందు నమ్మకమున్నదని ఋజువగుచున్నది, ఉదాహరణకు ఐగుప్తు దేశీయులు ఆకాశము నంటుకొనియున్నట్లు నిర్మించుకొనిన పిరమిడ్లు (గోపురములు) దీనికొక సాదృశ్యముగ యున్నవి. భారతీయులలో పునర్జన్మను గూర్చిన యభిప్రాయములు ప్రబలి యున్నవి. దీనినిబట్టి మానవుడు శాశ్వతముగా నిర్మూలించబడుటకు కాదుగాని ఏదోఒక రీతిగ తను శాశ్వత ఉనికిని కలిగియుండుటకు ఆశించుచున్నవానిగా కనబడుచున్నాడు.

మానవజాతి యంతటిలోను మార్పు జెందని కొన్ని నిత్య

సత్యములున్నవి. అవి ఒకేఒక్క దేవునియందు నమ్మిక కలిగియుండుట, మంచి చెడుగు అను విచక్షణజ్ఞానము, భావిజీవితమందు ప్రగాఢమైన విశ్వాసము, క్రియ ప్రక్రియలను గూర్చిన జ్ఞానము మొదలగునవి. ఇవి సార్వజనికమైనవి. మానవులకు వీటిని గూర్చి యెవరును బోధించకనే వారు వీటిని యెరిగి యున్నారు. ఈసంగతులను గూర్చిన వారి జ్ఞానము ఎక్కడనుండి వచ్చినదో మనము వివరించుకొనలేకపోయినను వారి విశ్వాసము ఆధారము లేనిదికాదు.

ఈ భూమిపై యున్న జీవరాసు లన్నియు ఏదో ఒక ప్రయోజనమును కలిగియున్నవి. కొన్ని మానవునికి ఆహారము కొరకు ప్రయోజనకారియై యున్నవి. కొన్ని క్రిమి సంహారకులుగాను, మరి కొన్ని మన వాతావరణమును పరిశుభ్రముగా నుంచునవిగాను యున్నవి. అయితే ఈ పుడమిపై మానవుని ప్రయోజన మేమిటి? అతడు తన సృష్టికర్తయైన దేవుని కొనియాడుచు, మహిమ పరచుచు ఆయనతో నిత్యము జీవించుటకు చేయబడని యెడల మరెందుకు అతడు చేయబడెను?

మానవుని భౌతిక సంబంధమైన కోరికలను తీర్చుకొను ఆధారము భూమిపై యున్నది. శబ్దతరంగములను పరిగ్రహించుటకు చెవులు అవుసరము. వర్ణములను గుర్తించుటకు నేత్రము లవుసరము. వాతావరణములోని గాలిని పీల్చుటకు ఊపిరితిత్తులు అవుసరము. ఆహారమునకు ఆకలియు, దాహమునకు దప్పికయు అవుసరము. ఈ భౌతికావుసరము లన్నిటిని తీర్చుకొనుటకు మానవుని శరీరమును దేవుడు తయారు చేసెను. అట్లయినపుడు నిత్యము జీవించవలెనని మానవునికున్న ఆత్మీయ తృష్ణను దేవుడు తీర్చడా?

ప్రకృతిని మనము గమనించుటద్వారా అమర్త్యత మరింత నిశ్చయము అని మనకు ఋజువు అగుచున్నది. గొంగళిపురుగు సీతా

కోక చిలుకగా మారి స్వేచ్ఛగా తిరుగులాడుటలో మానవునికున్న నిత్యజీవిత తృష్ణ తీర్చబడగలదని విశ్వసించవచ్చును. ఈ శరీరంధక ముల నుండి మానవుని ఆత్మ నిత్యత్వములో ప్రవేశించుట ఆ పురుగులో మనకు కన్పడుచున్నది. ప్రకృతిలోని ఋతువులే మరణమును, సమాధిని, అనగా కొంత కనిపెట్టు కాలమును, అటుతరువాత అతి మనోహరమైన క్రొత్తజీవితము జీవించుటకు ఒక పునరుత్థానమును సూచించుచున్నవి. ఆయా సంగతుల ద్వారా మానవుడు ఈ లోక జీవితముకంటె ఘనమైన జీవితముకొరకు ఎదురు చూడవచ్చునని దేవుడు చెప్పకపోతే వాటియొక్క ప్రయోజన మేమి? అందుకే "దేవుని అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి" యని అపొ.పౌలు రోమా 1:20 లో వ్రాసెను.

మానవుని నైతిక పరిజ్ఞానమే నైతిక విలువలు కాపాడు దేవుడొకడు ఉన్నాడని మనకు తెలియజేయుచున్నది. ఈలోక మంతయు ఒక నైతిక చక్రములో యుండి పరిభ్రమించు చున్నట్లు మనము చూడగలము. ఈ నైతిక చక్రములో మానవుడు తన క్రియలనుబట్టి ప్రతిఫలము నొందుటకో లేక శిక్ష ననుభవించుటకో ఎదురు చూచు చున్నాడు. అయితే ఒక్కొసారి నీతిమంతులు శ్రమల నొందుట, దుర్మార్గులు సుఖముగ జీవించుట, సజ్జనులు పరాజయులగుట, దుర్జనులు విజేయులగుట మనము చూచుచుందుము. అట్టి సమయాల్లో మానవులు ఈ జీవితములో కాకపోయిన భావి జీవితంలో న్యాయమును దేవుడు తప్పక తీర్చునని యెదురు చూచుట సహజము. ఆ భావిజీవితంలో నీతిమంతులకు న్యాయము చేకూర్చబడుట, అనీతి మంతులు తగిన రీతిగ శిక్షింపబడుట జరుగునని మనందరము యెద్దురు

చూచుచునే యున్నాము. నిత్యజీవితం అంటూ లేనియెడల మానవుని కున్న ఈ నైతిక విలువల ప్రయోజనము శూన్యమే గదా.

నిత్యజీవితమనునది నమ్మతగిన వాస్తవమని బైబిలు బోధించుచున్నది. పాతనిబంధనలో ఇద్దరు భక్తులు హనోకు, ఏలియా అనువారు మరణమును రుచిచూడకనే పరమునకు కొనిపోబడుటను గూర్చి చెప్పబడియున్నది. మరియు దేవుడు నిర్ణయించిన ఒకానొక దినమందు "సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు; కొందరు నిత్యజీవము అనుభవించుటకును, కొందరు నిందపాలగుటకును నిత్యముగా హేయులగుటకును మేలుకొందురు" అని దానియేలు 12:2లో వ్రాయబడి యున్నది.

యేసుక్రీస్తునందు నిత్యజీవితము దృఢమైన వాస్తవమని మనకు మరింత తేటగా బోధింపబడినది. మరణించిన వారిలో ప్రథమ ఫలముగా ఇక నెన్నడు మరణించకుండు నిమిత్తము క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడు. యేసుక్రీస్తు మానవజాతికి నిత్యజీవితమును ప్రసాదించుట కొరకు చనిపోయెను. యేసుక్రీస్తు మరల రాబోవుచున్నాడు. మృతుల పునరుత్థానము జరుగునని, తీర్పు తప్పక జరుగునని, ఈ జీవితాంతమున ప్రతివాడు తాను చేసిన క్రియలను బట్టి ప్రతిఫలమో లేక శిక్షయో పొందునని చేయబడిన వాగ్దానము లన్నియును మనము నిత్యము జీవించెదమని నిర్ధారణ చేయుచున్నవి. (యోహాను 5 : 28-29; మత్తయి 10 : 28; 1 కొరింథి 15 : 53-54, 2 కొరింథి 5:1-4).

"కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవముగలవాడు. కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును" అని యేసు బోధించెను (యోహాను 3:36). యేసుక్రీస్తునందు విశ్వాసముంచుము, నీపాపముల విషయమై మారుమనస్సు పొంది, నీ పాపక్షమాపణ నిమిత్తము

బాప్తిస్మము పొందుము. అటుతరువాత నీవు మరణము వరకు నమ్మకముగా యున్నయెడల ఆయన నీకు నిత్యజీవిత కిరీటాన్ని బహూకరించును (యోహాను 14:1, అపొ.కా. 2:38, ప్రకటన 2:10).

—జాషువా గూటం.

— o —

## ఆదిమ సంఘము యొక్క పెరుగుదల

## ( Growth of the Early Church )

పెంతెకొస్తునాడు క్రీస్తు సంఘము ఆరంభమాయెను (అపొ.కా. 2). క్రీస్తే పునరుత్థానుడైన ప్రభువని పేతురు ప్రసంగించెను. "మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను" అని అతడు ఇశ్రాయేలీయులకు ప్రబోధించెను (అపొ. కా. 2:36). ఆ ప్రజలు తమ హృదయములో నొచ్చుకొని "సహోదరులారా, మేమేమి చేతుము" అని అడుగగా "పేతురు - మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని చెప్పెను (అపొ.కా. 2:37-38). ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది బాప్తిస్మము పొందిరి (అపొ. కా. 2:41). తరువాత ఇంచుమించు ఐదువేలమంది పురుషులు చేర్చబడిరి (అపొ.కా. 4:4). మరికొంత కాలానికి పురుషులును స్త్రీలును అనేకులు మరి యెక్కువగ విశ్వాసులై ప్రభువు పక్షమున చేర్చబడిరి (అపొ.కా. 5:14). మరియు శిష్యుల సంఖ్య విస్తరించుచుండెను (6:7). శిష్యులు చెదరిపోక ముందు యెరూషలేములో వారు యించుమించు 25 వేల మంది యుండిరి.

యెరూషలేములోని ఆదిమ సంఘము త్వరితగతిని ఎట్లు అభివృద్ధి జెందెనో మనం తెలిసికొనుట మంచిది. అపొస్తలుల కార్య

ములలోని మొదటి కొన్ని అధ్యాయములనుండి దాని అభివృద్ధి యొక్క లక్షణములను తెలిసికొందము.

### ఆదిమ సంఘము ఎట్లు అభివృద్ధి జెందెను ?

**1.** పట్టుదల : "వారు ఎడతెగక యుండిరి" (అపొ. కా. 2:42). వారు ఏకాగ్రత, పట్టుదల కలిగి యుండిరి. నేడు అనేక మంది సభ్యులు కొంతకాలము కనబడి మరికొంత కాలం మాయమైపోవుట వలన సంఘము అభివృద్ధి జెందుటలేదు. కొందరు కొంత కాలము మట్టుకు ఆసక్తి కలిగియుంటారు, అటు తరువాత ఆ యాసక్తిని కోల్పోతారు. నేడు సంఘాల్లో పట్టుదల కలిగిన వారవసరం.

**2.** నమ్మకత్వము : వారు అపొస్తలుల బోధయందు ఎడతెగక యుండిరి. వారు అపొస్తలుల బోధయందు నమ్మకముగా నిలిచియుండిరి. పౌలు తిమోతిని ఇట్లు హెచ్చరించాడు : "నిన్ను గూర్చియు నీ బోధను గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము; వీటిలో నిలకడగా యుండుము; నీవీలాగు చేసి నిన్నును, నీ బోధ వినువారిని రక్షించుకొందువు" (1 తిమో 4:16). ఆదిమ సంఘము సత్యానికి విలువ నిచ్చెను. అపొస్తలుల బోధయందు నిలకడగా యుండుట వలన వారు అభివృద్ధి జెందిరి. ఆదిమ సంఘము సత్యమును బోధించినందున వారి శిష్యుల సంఖ్య విస్తరించెను.

**3.** ఏకత్వము : "విశ్వసించిన వారందరును ఏక హృదయమును ఏకాత్మయు గలవారై యుండిరి" (అపొ.కా. 4:32). శిష్యులందరు ఒకే విషయముపై ఏకత్వము కలిగియుండిరి. ఒక స్థానిక సంఘసభ్యు లందరు ఏకాత్మయు, ఏక హృదయము గలవారై యుండిరని చెప్పుకొనుటకంటె గొప్ప ఘనత ఇంకేమున్నది? నేడు అనేక చోట్ల విభజనలు వితర్కములు కనబడుచున్నవి. అవి శరీర కార్య

ముల వలన కలుగుచున్నవి. అవి అసూయ, ద్వేషము, కోపము మొదలగునవి. వీటిని మనం విసర్జించి అందరు ఏకభావము, ఏక తాత్పర్యము కలిగియుండుటకు ప్రయత్నించాలి (1 కొరింథి 1:10).

4. దాతృత్వము : ఆదిమ శిష్యులు ఒకరి యెడల ఒకరు దాతృత్వము కలిగి యుండిరి. "ఎవడును తనకు కలిగిన వాటిలో ఏదియు తనదని అనుకొనలేదు; వారికి కలిగినదంతయు సమిష్టిగా ఉండెను" (అపొ. కా. 4 : 32). తరువాత వారికి సమయము దొరికిన కొలది వారందరికీ మేలు చేయుచుండిరి (గలతీ 6:10; 2 కొరింథి 9:13).

5. క్రమశిక్షణ : అననీయ సప్పీరాలు తాము పొలమును అమ్మగా పొందిన ధనమునుగూర్చి అబద్ధములాడగా పరిశుద్ధాత్మ దేవుని ఉగ్రతవలన మరణించిరి (అపొ. కా. 5:1-10). "సంఘమంతటికిని ఈ సంగతులు వినిన వారి కందరికిని మిగుల భయము కలిగెను" (అపొ. కా. 5:11). అందువలన క్రీస్తు సంఘమంటే అందరికి భయం అని మనమనుకొన వచ్చును గాని, "పురుషులును స్త్రీలును అనేకులు మరి యెక్కువగ విశ్వాసులై ప్రభువు పక్షమున చేర్చబడిరి" యని చెప్పబడినది (అపొ. కా. 5:14). దేవునియొక్క ప్రణాళిక శ్రేష్టమైనదని మనం మరతుము. క్రమశిక్షణ హెచ్చరిక ద్వారాను, అవసరమయితే సహవాస బహిష్కరణ ద్వారాను ఇప్పుడు అమలు పరచబడుచున్నది (2 థెస్స 3:6). ఆదిమ సంఘములో బోధింపబడిన రీతిగ క్రమ శిక్షణను అమలు పరచడానికి తరుచు మనం గొప్పగా సంశయిస్తాము. అయితే సంఘము అభివృద్ధి చెందాలంటే క్రమశిక్షణ అత్యవసరము.

6. దినదినము బోధ : "మరియు వారేకమనస్కులై ప్రతి దినము దేవాలయములో తప్పక కూడుకొనుచు, ఇంటింట రొట్టె విరుచుచు, దేవుని స్తుతించుచు ప్రజలందరి వలన దయపొందినవారై

ఆనందముతోను, నిష్కపటముతోను ఆహారము పుచ్చుకొనుచుండిరి" (అపొ.కా. 2 : 46). ఆదిమ శిష్యులు ప్రతి దినము దేవుని కొరకు జీవించిరి. "వారు ప్రతి దినము దేవాలయములోను ఇంటింటను మానక బోధించుచు, యేసే క్రీస్తని ప్రకటించుచుండిరి" (అపొ.కా. 5:42).

7. ప్రతిష్ఠత : అపొస్తలులను సమాజ మందిరము యెదుటకు తీసికొని వెళ్ళిన తరువాత వారు యేసు నామమును ప్రకటించరాదని హెచ్చరింపబడిరి. వారిని కొట్టి విడుదల చేసిరి. వారు విడుదల పొంది, "ఆ నామము కొరకు అవమానము పొందుటకు పాత్రులని యెంచబడినందున వారు సంతోషించుచు మహాసభ నుండి వెళ్లిపోయిరని" చెప్పబడినది (అపొ. కా. 5:41). వారు ఎంతవరకు ప్రతిష్ఠించుకొన్నారో గదా! తరువాత పేతురు ఇట్లు హెచ్చరించాడు: "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ ననుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆ నామమును బట్టియే దేవుని మహిమపరచవలెను" (1 పేతురు 4:16). ఆదిమ శిష్యులు యిట్టి మనస్తత్వమును కలిగియుండిరి. గనుకనే సంఘము అభివృద్ధి జెందినది.

నీవు ఆరాధన చేయుచున్న సంఘము అభివృద్ధి జెందుచున్నదా? దేవుడు తన వాక్యములో ఒక మాదిరిని మన కిచ్చియున్నాడు. ఆ మాదిరి ననుసరించుటకు మనం తీవ్రముగా ప్రయత్నించాలి.

—ఏలన్ హాయర్స్.

---

## రక్షింపబడుటకు సంఘ సభ్యత్వము అవసరమా ?

## (Is Church Membership Essential for Salvation?)

రక్షింపబడాలంటే సంఘ సభ్యుడవనక్కర్లేదు; సంఘము ఎవరిని రక్షించదు; ఒకడు ఏ సంఘ సభ్యుడు కాకుండగానే క్రైస్తవుడుగా

యుండవచ్చును అనే మాటను మనం తరుచు వినుచుంటాము. నైతికంగా సత్ప్రవర్తన కలిగియుంటే క్రైస్తవుడై యుండుటతో సమానమని అనేకులు భావింతురు. మనం లేఖనములను పరిశోధించు ఈ సంగతులు సత్యమో కాదో తెలిసికోవాలి. రక్షణను గూర్చి, సంఘ సభ్యత్వమునుగూర్చి బైబిలు యేమి చెప్పుచున్నదో గమనించుము :

## ప్రభువు ఎక్కడ రక్షించుచున్నాడు ?

ప్రభువు రక్షించునని బైబిలు చెప్పుచున్నది. అయితే ఎక్కడ? సంఘములోనా లేక దాని వెలుపలా? దేవుని మరతులకు లోబడని వారు ఎల్లప్పుడు బయటనే యుందురు. నోవహు కాలములో జలప్రళయము నుండి ప్రజలకు రక్షణను దేవుడు ప్రకటించాడు. అయితే జలప్రళయమునకు ముందు ఎవరైతే ఆ ఓడలో ప్రవేశిస్తారో వారికే రక్షణ అనుగ్రహింపబడినది. "ఆ ఓడలో కొందరు అనగా ఎనిమిది మంది నీటిద్వారా రక్షణ పొందిరి" యని పేతురు చెప్పాడు (1 పేతురు 3:20). రక్షణ ఆ ఓడలో యున్నది. ఓడకు వెలుపల యున్న వారందరు నశించిరి.

జల ప్రళయమునుండి రక్షణను దేవుడు ఓడలో యుంచెను గనుక నేడు రక్షణను ఆయన ఎక్కడ ఉంచాడు? అనే ప్రశ్న మనకు సహజంగా వస్తాది. రక్షణ క్రీస్తులో యున్నది. అపో.పౌలు ఇట్లనుచున్నాడు: "అందుచేత ఏర్పరచబడినవారు నిత్య మహిమలోకూడ క్రీస్తు యేసునందలి రక్షణ పొందవలెనని నేను వారికొరకు సమస్తము ఓర్చుకొనుచున్నాను" (2 తిమో 2:10). "మరి ఎవనివలనను రక్షణ కలుగదు. ఈ నామమునసే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" అని పేతురు ప్రకటించాడు (అపో.కా. 4:12). రక్షణ

క్రీస్తులోనేగాని మరెక్కడను లేదు. "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" (యోహాను 14:6).

ఆత్మీయాశీర్వాదము లన్నియు క్రీస్తునందే యున్నవి (ఎఫెసీ 1:3). విమోచన క్రీస్తునందున్నది. "క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుదురు" (రోమా 3:24). క్షమాపణ క్రీస్తులో యున్నది. "ఆ కుమారుని యందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది" (కొలస్స 1 : 14; ఎఫెసీ 1:7). క్షమాపణ క్రీస్తులో యున్నది గనుక ఒకని పాపములు క్షమించబడాలంటె అతడు క్రీస్తులో యుండాలి.

క్రీస్తులో యున్నవాడు నూతన సృష్టి. "ఎవడైనను క్రీస్తునందున్న యెడల అతడు నూతన సృష్టి" (2 కొరింథి 5 : 17). క్రీస్తుకు వెలుపల యెవడును నూతన సృష్టి కాలేడు. ఆత్మీయ జీవితము క్రీస్తులో యున్నది. "దేవుడు మనకు నిత్యజీవమును దయచేసెను; ఈ జీవము ఆయన కుమారుని యందున్నది. దేవుని కుమారుని అంగీకరించువాడు జీవముగలవాడే" (1 యోహాను 5:11, 12). ఆత్మీయ జీవము దొరుకు చోటుకు వెలుపల ఉండి ఏ మానవుడు ఆత్మీయ జీవాన్ని అనుభవించ లేడు. ఒకని పాపములు క్షమింపబడినప్పుడు అతడు దేవునితో సమాధానపడును. యూదుడు అన్యజనుడు కూడ ఒకే శరీరములో సమాధాన పరచబడ్డారని పౌలు చెప్పుచున్నాడు (ఎఫెసీ 2 : 16). గనుక ఒకడు క్షమించబడాలంటే అతడా శరీరములో యుండాలి. ఆయన శరీరము (సంఘము) లో యుండుట అనగా క్రీస్తులో యుండుటయే.

## క్రీస్తులో యుండుట అనగా ఆయన సంఘములో యుండుటయే

బైబిలులో కనబడు 'ఒకే శరీరమే' సంఘమై యున్నది.

"మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22, 23). "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు" (కొలస్స 1:18). ఆ శరీరమందు ప్రజలు సమాధాన పరచ బడుదురు (ఎఫెసీ 2:16). శరీరమే సంఘము. గనుక ప్రజలు ఆ ఒకే సంఘమందు రక్షించబడుదురు.

మరల క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడని పౌలు ప్రకటించుచున్నాడు. "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్న లాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:23). మనుష్యుడు రక్షింపబడాలంటే క్రీస్తు దేనికి రక్షకుడై యున్నాడో దానిలో అతడుండాలి. సంఘము క్రీస్తుయొక్క శరీరమై యున్నందునను, క్రీస్తు ఆ శరీరమునకు రక్షకుడై యున్నందునను, రక్షింపబడిన వాడెవడును ఆ సంఘ సభ్యుడు కాకుండ లేడు.

మన ప్రభువు యొక్క సంఘము రక్షకుడు కాదు; గాని అది రక్షింపబడిన వారితో సమకూర్చబడినది. గత పాపముల నుండి రక్షింపబడిన వారందరు సంఘములో యుందురు. మరియు "రక్షణ పొందినవారిని ప్రభువు అనుదినము సంఘముతో చేర్చుచుండెను" అని బైబిలు బోధించుచున్నవి (అపొ. కా. 2 : 47). వారు రక్షింపబడు చుండగా సంఘముతో చేర్చబడిరి, చేర్చబడుచుండగా రక్షింపబడిరి.

ఇప్పుడు ఇంకొక సంగతిని గమనించు: రక్షింపబడుట యనగా క్రీస్తులో యుండుట. ఏలయనగా రక్షణ క్రీస్తులో యున్నది. రక్షింపబడుటయనగా సంఘములో యుండుటతో సమానము. ఏలయనగా రక్షింపబడిన వారిని ప్రభువు సంఘముతో చేర్చును. గనుక క్రీస్తులో యుండుట అనగా ఆయన సంఘములో యుండుటతో సమానము. రక్షింపబడాలంటే

ఒకడు క్రీస్తులో యుండుట అవుసరము, ఆయన సంఘములో యుండుట అవుసరము. క్రొత్త నిబంధన సంఘమునకు వెలుపలయున్న వారెవరు రక్షింపబడినవారు కారు. ఏలయనగా రక్షింపబడిన వారందరినీ ప్రభువు తన సంఘముతో చేర్చును. క్రీస్తు సంఘమునకు వెలుపల ఎవడైనను రక్షింపబడగల్గితే వాడు క్రీస్తులో లేకుండగనే రక్షింపబడును! అట్టిది అసంభవము. గనుక క్రీస్తుకు వెలుపల యున్నవారు, ఆయన శరీరమునకు వెలుపల యున్నవారు నశించిన స్థితిలో యున్నారు. ఏలయనగా పాపములనుండి రక్షింపబడుటకు ఒకడు ఏమి చేయాలో, క్రీస్తు సంఘ సభ్యులగుటకును అదే చేయాలి.

సంఘముయొక్క బైబిలు నిర్వచనమును ప్రజలు గ్రహించునప్పుడు దాని సభ్యత్వపు అవుసరతను కూడ వారు గ్రహింతురు. రక్షింపబడిన వారందరు క్రీస్తు సంఘమై యున్నారు. క్రీస్తు వారికి శిరస్సై యున్నాడు. వివిధ ప్రాంతములలోయున్న స్థానిక సంఘములు క్రీస్తు సంఘములై యున్నవి (రోమా 16:16). క్రీస్తు సంఘమును క్రీస్తు స్థాపించియున్నాడు (మత్తయి 10:18). అదొక మతశాఖ కాదు. క్రొత్తనిబంధన సంఘము ఎన్నడు ఒక మతశాఖ కాదు. అయితే ప్రజలు అపార్థము చేసికొని క్రీస్తు సంఘములో గాని, మరొక సంఘములో గాని యుండి రక్షణ పొందవచ్చునుకొంటారు.

## ఏ డినామినేషన్‌లోను లేకుండా క్రైస్తవుడుగా యుండవచ్చును

క్రైస్తవ్యము డినామినేషన్లకు సంబంధించినది కాదు. క్రొత్త నిబంధనలో చెప్పబడిన క్రైస్తవుడెవడు ఏరకమైన డినామినేషన్‌లోను ఎన్నడు లేడు. ఇప్పుడు కూడ అలాగే యుండాలి. అందరు బైబిలునే వెంబడిస్తే ఆలాగే ఈనాడుకూడ యుంటాది. రక్షింపబడాలంటే ఒకడు ఏ డినామినేషన్‌లోను ఉండనవుసరం లేదు. గాని క్రీస్తు సంఘములో

యుండాలి. క్రొత్త నిబంధనను మాత్రమే ప్రజలు వెంబడిస్తే వారు క్రైస్తవులే అవుతారు, క్రీస్తు సంఘ సభ్యులే అవుతారు. గనుక ప్రతి వ్యక్తి సువార్తకు లోబడి, ప్రభువుచే రక్షింపబడి, ఆయనచే సంఘములో చేర్చబడాలి.

## ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందును

బాప్తిస్మముద్వారా ఒకడు క్రీస్తులోనికి తేబడునని బైబిలు వక్కాణించుచున్నది. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:27; రోమా 6:3). ఒకడు క్రీస్తులోనైనా ఉంటాడు లేదా ఆయనకు వెలుపల యుంటాడు. బాప్తిస్మము పొందనివాడు క్రీస్తుకు వెలుపల యుంటాడు గనుక క్రీస్తులో యున్న ఏ ఒక్క ఆశీర్వాదమునకు అర్హుడు కాడు. ఒకడు విశ్వసించి, మారుమనస్సు పొంది, క్రీస్తును ఒప్పుకొని బాప్తిస్మము పొందుట ద్వారా రక్షింపబడతాడు, సంఘముతో చేర్చబడతాడు (అపొ. కా. 8:35-39; 2:38; 47; మార్కు 16:16).

## ముగింపు

రక్షింపబడుటకు ఒకడు క్రీస్తు సంఘ సభ్యుడు కావలెనా? అవును! సంఘమునకు వెలుపల రక్షింపబడితే క్రీస్తుకు వెలుపల రక్షింపబడినట్లే. అయితే క్రీస్తులోనే రక్షణ యున్నది గనుక (అపొ. కా. 4 : 12), ఒకడు క్రీస్తు సంఘసభ్యుడు కాకుండా రక్షింపబడనేరడు. రక్షింపబడినవారే క్రీస్తు సంఘము: క్రీస్తు సంఘమే రక్షింపబడినవారు. ఒకడు క్రీస్తు కృపద్వారా రక్షింపబడిన తరువాత అతడు విశ్వసనీయంగా క్రీస్తులోయుండి విధేయత చూపుచు అంతమువరకు జీవించితే నిత్యరక్షణలోనికి, పరలోకములోనికి ప్రవేశించును (ప్రక 2 : 10; 14 : 13; 22 : 14).

—పెర్రి కోతమ్.

# మారుమనస్సు - దీని ప్రాముఖ్యత
## (Repentance - It's Importance)

ప్రతి మానవుడు మారుమనస్సు పొందుటకు ఆసక్తి చూపవలెనని దేవుడు ఆజ్ఞాపించుచున్నాడు. "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచిచూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపో.కా. 17:30). ప్రతిచోట ప్రతి మానవుడు మారుమనస్సు యొక్క ప్రాముఖ్యతను గుర్తించి మారుమనస్సు పొందవలెను. ఎందుకనగా "అందరు పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" (రోమా 3 : 23). బాప్తిస్మమిచ్చు యోహాను "పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడని" యూదయ అరణ్యములో ప్రకటించుచుండెను (మత్తయి 3 : 2). "కాలము సంపూర్ణమై యున్నది, దేవుని రాజ్యము సమీపించి యున్నది; మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని" యేసుక్రీస్తు ప్రకటించెను (మార్కు 1:14-15). యేసు పంపిన 12 మంది అపొస్తలులు మనుష్యులు మారుమనస్సు పొందవలెనని ప్రకటించిరి. (మార్కు 6 : 12). యేసు తన అపొస్తలులకు ఇట్లు ఆజ్ఞాపించెను : "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి; క్రీస్తు శ్రమపడి మూడవదినమున మృతులలోనుండి లేచుననియు, యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సు పాపక్షమాపణయు ప్రకటించబడుననియు వ్రాయబడి యున్నది అని ఆయన వారితో చెప్పెను" (లూకా 24:46-47).

### అపొస్తలుల బోధ

పెంతెకొస్తను పండుగ దినమున పరిశుద్ధాత్మ చేత నడిపింపబడుచున్న పేతురు యేసుక్రీస్తు యొక్క పునరుత్థానమును గూర్చి

బోధించుచు అనేకులను ఒప్పించుచు మీ పాపముల నిమిత్తమై యేసు సిలువ వేయబడెనని వారికి గూఢిగా చెప్పెను. "వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని సహోదరులారా, మేమేమి చేతుమని అడుగగా; పేతురు - మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని చెప్పెను (అపో. కా. 2 : 37-38). శృంగారమను దేవాలయమువద్ద పేతురు ఇట్లనెను: "క్రీస్తు యేసును ఆయన పంపునట్లును మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారుమనస్సు నొంది తిరుగుడి"(అపో. కా. 3:20). ప్రతి మనుష్యుడు మారుమనస్సు పొందవలెనని పౌలు చెప్పెను. మారుమనస్సు పొందనిచో తాను నియమించిన మనుష్యుని చేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దిన మును నిర్ణయించి యున్నాడని, మృతులలోనుండి ఆయనను లేపినం దున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడని అతడు చెప్పెను (అపో.కా. 17:30-31). "కొందరు ఆలస్యమని యెంచు కొనునట్లు ప్రభువు తన వాగ్దానమునుగూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారు మనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు" (II పేతురు 3:9). మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరును ఆలాగే నశింతురు (లూకా 13:3). ఈ లేఖనభాగములను పరిశీలించినట్లయితే ఆయా సందర్భములలో దేవుడు మారుమనస్సు నకు ఇచ్చిన ప్రాముఖ్యత గమనించగలము. ప్రతి మనుష్యుడు ప్రతి చోట మారుమనస్సు పొందవలెననియు, మారుమనస్సు పొందకుండా ఒక మనుష్యుడు పాపక్షమాపణ సంపాదించుకోలేడనియు యేసు క్రీస్తు తన అపొస్తలులకు ఆజ్ఞాపించెను. ప్రజలు విధేయత చూపడానికి

ఇది కఠినమైన ఆజ్ఞయై యున్నది. మన దేశములో అనేకులు దేవుని కుమారుడైన యేసునందు విశ్వాసముంచెదరు కాని తమ పాపముల నిమిత్తము మారుమనస్సు పొందువారు కొద్దిమంది మాత్రమే. ఒక వ్యక్తి దేవుడు ఏమి ఆజ్ఞాపించుచున్నాడో తెలిసికొని దానిని నెరవేర్చడానికి తన హృదయములో నిశ్చయించికొన్నట్లయితే మారు మనస్సు పొందుట చాలా తేలికైన విషయము. అట్టివాడు మారు మనస్సుపొందుటయే కాదు బాప్తిస్మమును మరి ఏ యితర ఆజ్ఞనైనను సులువుగా పాటించగలడు.

## మారుమనస్సును గూర్చిన నిర్వచనములు

యేసుక్రీస్తు మరియు ఆత్మావేశపూరితులైన అపొస్తలులు మారుమనస్సు యొక్క ప్రాముఖ్యతను గూర్చి ఎట్లు నిర్వచించిరో పరిశుద్ధ లేఖనములనుండి చూతము. ఒక మనుష్యుడు, ఏమనుష్యుడై నను, ఎవరైననూ మారుమనస్సు తప్పక పొందవలెనని దేవుడు ఆజ్ఞా పించెను. మారుమనస్సు పొందుట మానవకోటి విధియై యున్నది. ఇది చిన్న విషయము కాదు. విచారపడుట మారుమనస్సు కాదు. ఇది సార్వజనికమై యున్నదని దైవ లేఖనములనుబట్టి గ్రహించగలము. ముప్పది వెండి నాణెములకు యేసుప్రభువును అమ్మిన తరువాత ఇస్కరియోతు యూదా దుఃఖపడెనుకాని మారుమనస్సు పొందలేదు. దుఃఖము నకు మారుమనస్సునకు సంబంధము కలదు. పెంతెకోస్తు దినమున జరిగిన కొన్ని సంఘటనలను గమనించెదము. 1) మీరు దుష్టులచేత ఆయనను సిలువ వేయించి చంపితిరని పేతురు బోధించెను. 2) మీ పాపముల నిమిత్తము ఆయన దోషి, ఆయెను. 3) వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని (పొడువబడి) సహోదరులారా, రక్షణ పొందుటకు మేమేమి చేతుమని అడిగిరి. 4) పేతురు పశ్చాత్తాపము పొందుట మారుమనస్సు పొందుటయే అని మాత్రము చెప్పలేదు.

గాని అతడిట్లు చెప్పెను. "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమా పణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు (అపొ.కా. 2 : 38). "దైవ చిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును. ఈ మారుమనస్సు దుఃఖమును పుట్టించదు. అయితే లోకసంబంధమైన దుఃఖము మరణమును కలుగ జేయును" (II కొరింథి 7:10).

## మారుమనస్సు ఉదాహరణలు

మత్తయి సువార్త 21వ అధ్యాయము 28-29 వచనములలో యేసుక్రీస్తు మారుమనస్సును గూర్చి ఇట్లు వివరించెను: "ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. అతడు మొదటివాని యొద్దకు వచ్చి కుమారుడా, నేడు పోయి ద్రాక్ష తోటలో పనిచేయుమని చెప్పగా వాడు పోను అని యుత్తర మిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొని పోయెను. ఇక్కడ మనము ఆలోచించినట్లయితే పెద్ద కుమారుడు తనంతట తానే మనస్సు మార్చుకొనెను. యేసు రెండవవాని యొద్దకు వచ్చి ఆ ప్రకారమే చెప్పగా వాడు అయ్యా, పోదుననెను గాని పోలేదు". వానియొక్క పోమరితనము మారుమనస్సు పొందని పరిస్థితి రెండవవానియందు చూడగలము.

"నీనెవె వారు యోనా ప్రకటన విని మారుమనస్సు పొందిరి గనుక విమర్శ సమయమున నీనెవెవారు ఈ తరమువారితో నిలువబడి వారిమీద నేరస్థాపన చేయుదురు. ఇదిగో యోనాకంటె గొప్పవాడు ఇక్కడ ఉన్నాడు" (మత్తయి 12 : 41) అని యేసు చెప్పుటలోగల ఉద్దేశ మేమనగా యోనా ప్రకటన వినిన నీనెవె ప్రజలు మారుమనస్సు పొందిరి. "నీనెవెవారు తమ చెడునడతలను మానుకొనగా వారు చేయుచున్న క్రియలను దేవుడు చూచి పశ్చాత్తాప్తుడై వారికి

చేయుదునని తాను మాటఇచ్చిన కీడును చేయక మానెను (యోనా 3 : 10). దుష్ట మార్గమునుండి తిరుగుటయే నిజమైన మారుమనస్సు అని యేసు చెప్పెను. "భక్తిహీనులు తమ మార్గమును విడువవలెను. దుష్టులు తమ తలంపులను మానవలెను. వారు యెహోవావైపు తిరిగిన యెడల ఆయన వారియందు జాలిపడును. వారు మన దేవునివైపు తిరిగిన యెడల ఆయన బహుగా క్షమించును" (యెషయా 55:7).

మారుమనస్సు మనుష్యుని మనస్సును మార్చును. దైవ చిత్తానుసారమైన దుఃఖము మారుమనస్సు కలుగజేయును. అది నూతన జీవితముగా మార్చును. నీనెవె ప్రజలు తమ క్రియలను తాము పరిశీలించుకొని దేవునికి అనుకూలముగా తమ జీవితములను మార్చుకొనుట ద్వారా మంచిపనులను చేసిరి. వారి పశ్చాత్తాపమును దేవుడు మారుమనస్సు అనెను. మత్తై 21:28-29 లోని మొదటి కుమారుడు తన తండ్రి చిత్తమునకు అనుకూలముగా తన జీవితమును నిర్ణయమును, మనస్సును మార్చుకొనెను. ఇది నిజమైన మారుమనస్సు. చెడును విడిచి మంచిని పాటించెను. కనుక నీవు తడవు చేయుట ఎందుకు? మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుట ద్వారా క్రీస్తులో ప్రవేశించి రక్షింపబడుము.

—బఫోర్డ్ సి. హోల్ట్.

— o —

## క్రియాజనకమైన విశ్వాసము

## (The Faith that Works)

హెబ్రీ 11వ అధ్యాయము

బైబిలు విశ్వాసమును గూర్చి బోధించునప్పుడు దానిలో క్రియలు దాగియున్నవను సంగతి గుర్తించక అనేకులు పొరబడుచున్నారు. తద్వారా అనేక అబద్ధ సిద్ధాంతము లుద్భవించాయి.

ఉదా॥ విశ్వాసము వలన మాత్రమే రక్షణ మొదలగునవి. హెబ్రీ పత్రిక 11వ అధ్యాయములో విశ్వాసముయొక్క నిర్వచనము మరియు వివరణ అనేక సంఘటనలద్వారా వ్రాయబడి యున్నది. ఆ అధ్యాయమును చదువునప్పుడు క్రియాజనకమైన విశ్వాసమును గూర్చి ఈ క్రింది విషయాలు తెలిసికొనగలము.

1. విశ్వాసము దేవుడు అర్పించమన్నది అర్పిస్తుంది.
   ఉదా: హేబెలు (4 వచనము), అబ్రహాము (17 వచనము)
2. విశ్వాసము దేవునికి ఇష్టమైన జీవితం జీవించులాగున చేయును (6వ వచనము)
3. విశ్వాసము దేవునియందు భయభక్తులు కలిగించును
   ఉదా: నోవహు (7వ వచనము)
4. విశ్వాసము దేవుడు సిద్ధము చేయుమన్నది సిద్ధము చేయును.
   ఉదా: నోవహు (7వ వచనము)
5. విశ్వాసము దేవుడు బయలుదేరమంటే బయలుదేరును
   ఉదా: అబ్రాహాము (8వ వచనము)
6. విశ్వాసము దేవుడు ఎక్కడ నివసించమంటె అక్కడ నివసించును
   ఉదా: అబ్రాహాము (9వ వచనము)
7. విశ్వాసము కనబడని పట్టణము కొరకు ఎదురు చూచును
   ఉదా: అబ్రాహాము (10వ వచనము)
8. విశ్వాసము దేవుని వాగ్దానముల యందు నిరీక్షించును
   ఉదా: శారా (11వ వచనము)
9. విశ్వాసము అసాధ్యమైన దానిని సాధ్యపరచును (11 వచనము
10. విశ్వాసము భయమును పారద్రోలును
   ఉదా: మోషే తలిదండ్రులు (23వ వచనము)

11. విశ్వాసము అదృశ్యమైన వాటిని చూచును
ఉదా: మోషే (27వ వచనము)

12. విశ్వాసము దేవుడు ఆచరించమన్నది ఆచరించును.
ఉదా: మోషే (28వ వచనము)

"విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటియొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు ఋజువునై యున్నది. దానిని బట్టియే పెద్దలు సాక్ష్యము పొందిరి" (హెబ్రీ 11:1-2).

(సత్యవాక్యములు సౌజన్యంతో)

—o—

## మనము మరువకుండు నిమిత్తము

## (Lest we Forget)

క్రొత్త నిబంధన క్రైస్తవ్యమును పునరుద్ధరించుటయే మన కర్తవ్యము. క్రీస్తులో తప్ప వేరొకరిలో రక్షణ లేదు. ఈ గొప్ప ప్రాథమిక సూత్రము దేవుని నుండి కలిగినప్పుడు ఎంత సత్యమో ఇప్పుడును అంతే సత్యము: "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారుని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16).

"సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" అని మనము చదువగలము (రోమా 1:16). సువార్త యను మాటకు మంచి వార్త యని అర్థము. అయితే ఈ సువార్త యేది? దేవుని వాక్యములో మరల చూచుకొందము: "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన

సువార్తను మీకు తెలియుపరచు చున్నాను. మీరు దానిని అంగీక రించితిరి, దానియందే నిలిచి యున్నారు. మీ విశ్వాసము వ్యర్థ మైతేనేగాని, నేను ఏ ఉపదేశ రూపముగా సువార్త మీకు ప్రక టించితినో, ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొని యున్న యెడల ఆ సువార్త వలననే మీరు రక్షణ పొందువారై యుందురు. నాకియ్య బడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా లేఖన ముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేప బడెను" (1 కొరింథి 15:1-4).

ఈ వాస్తవాలు అన్ని వేళలా ప్రకటింపబడవలెనని దేవుడు నిర్ణయించెను. ఈ వాస్తవములను విశ్వసించుట ద్వారాను, మన ప్రభువైన యేసుక్రీస్తుకు విధేయత చూపుట ద్వారాను మానవులు రక్షింపబడగలరు. పరిశుద్ధాత్మావేశము వలన మార్కు యిట్లు లిఖిం చాడు: "మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింప బడును, నమ్మనివానికి శిక్ష విధించబడును" (మార్కు 16:15-16). మత్తయి ఇట్లు వ్రాసాడు: "యేసు వారి యొద్దకు వచ్చి - పరలోక మందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదా కాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:18-20). తరువాత, లూకా యిట్లు వ్రాసాడు: "క్రీస్తు శ్రమపడి మూడవ

దినమున మృతులలోనుండి లేచుననియు, యెరూషలేము మొదలు కొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును పాప క్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడి యున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు" (లూకా 24:46-48).

యేసు ఈ లోకమును విడిచి పరలోకమందున్న తండ్రియొద్దకు ఆరోహణుడగుచుండగా ఈ సంగతులను తన శిష్యులుకు వివరించెను. "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు. గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంతముల వరకును నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను" (అపో.కా. 1:8). పరిశుద్ధాత్మ వచ్చినప్పుడు వారు సాక్షులగుదురు. పరిశుద్ధాత్మ వచ్చి యేమి చేయును? "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 16:13).

పెంతెకొస్తునాడు పరిశుద్ధాత్ముడు వచ్చెను. ఎంచుకొనబడిన సాక్షులు తమ సాక్ష్యము నిచ్చిరి (అపో.కా. 2 : 14-47). సువార్త ప్రకటింపబడెను (అపో. కా. 2:36). మారుమనస్సు పాపక్షమాపణలు ప్రకటింపబడెను (అపో. కా. 2 : 38). క్రీస్తునందే రక్షణ యున్నది (అపో.కా. 4:12). దేవుని యొక్క నానావిధమైన జ్ఞానము సంఘము ద్వారా తెలియజేయబడవలెను (ఎఫెసీ 3:10-11). అది ఇప్పుడు, ఎల్లప్పుడు జరుగవలయును (ఎఫెసీ 3:20-21). మనము ఈ సంగతులను మరువరాదు.

—జె.సి. బెయిలీ.

— o —

# సత్యవాక్కు పాఠకులకు విజ్ఞప్తి

సత్యవాక్కు మాసపత్రికను గత 14 సంవత్సరాలలోను దేవుని మహోచితమైన కృపను బట్టి ప్రతి నెల విడువకుండా సమయానికి మీ చేతులలో వుంచగలిగాము. దీనిలో ప్రచురింపబడిన వ్యాసములు, గేయములు వగయిరా అన్నీ సత్యవాక్యము ననుసరించి యున్న వే. యేసుప్రభువును ఆయన సంఘాన్ని సత్యవాక్యాన్ని అన్ని వేళలా పైకెత్తుటకే ప్రయత్నించాము, ప్రయత్నిస్తాము. బోధకులకు, ఉపదేశకులకు, సామాన్య సభ్యులకు కూడ సత్యవాక్కు ఉపయోగకారిగ యున్నది.

ఈ సంచికతో సత్యవాక్కు 8200 గృహాలను దర్శించుచున్నది. నెలకు మూడువందల మందికి పైగా సత్యవాక్కు కావాలని మాకు వ్రాయుచున్నారు. ఆర్థిక వనరుల కొరతవలన వారందరికీ ఈ పత్రిక పంపించ లేక పోవుచున్నాము. ఈ పత్రిక మొదలుపెట్టిన నాటినుండి దీనికి సాలు చందా ఇంతయని మేము నిర్ణయించ లేదు. సరిగదా గత మే నెల నుండి 5000 కాపీలు మాత్రమే ముద్రించుటకు వనరులు సమకూడాయి. అయినను మిగతా 3200 మందికి ఈ పత్రికను పంపించుట మానివేయ లేదు. భవిష్యత్తులో సత్యవాక్కు కావాలని మీరు కోరుచున్న యెడల రూ. 20/- లకు తక్కువ కాకుండా కొంత నగదు కానుకగా పంపిస్తూ మీ కోరికను వెంటనే మాకు తెలియ జేయండి. మీనుండి మాకు ఏవిధమైన వార్త రాకపోతే మీ పేరు సత్యవాక్కు జాబితానుండి తొలగించబడును. అట్లు చేయుటకు మాకు ఇష్టము లేకపోయినను ఆర్థికపరమైన ఇబ్బందులదష్ట్యా మేము చేయక తప్పదు. మీరు మాకు జాబు వ్రాయునప్పుడు మీ సత్యవాక్కు సభ్యత్వ నంబరు మాకు తప్పక తెలియ జేయండి. మీ కానుకలను ఈ దిగువ చిరునామాకు పంపించండి:

**SATYA WAKKU, P.O. Box 80, KAKINADA-533001.**

# సంక్షిప్త వార్తలు

అక్టోబరు నెల మొదటి వారంలో సహో. జాషువా గూటంగారు న్యూఢిల్లీకి వెళ్ళి సత్యవాణి రేడియో ప్రోగ్రాములు మరికొన్ని రికార్డు చేసిరి. ఈసారి యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములోని అంశములను ఆధారముగా చేసికొని 32 ప్రసంగములను ఆయన రికార్డు చేసిరి.

అక్టోబరు 20వ తేదీనాడు అమెరికానుండి సహో. జె.బి. ట్రోటరు గారు, పాల్ కూపరుగారు భారతదేశము విచ్చేసిరి. వారు కొన్ని వారములపాటు మన దేశంలో పర్యటించి ఆయా స్థానములలో యున్న క్రీస్తు సంఘములను దర్శించెదరు. 22వ తేదీ శుక్రవారంనాడు ఈ సహోలిద్దరు, జాషువాగారు కలసి చిత్తూరుజిల్లా సత్యవేడు వెళ్ళి అక్కడ జరుగుచున్న పనిని సందర్శించిరి. సత్యవేడులో ఎ.డి. సుందరరాజుగారు మంచి పని చేయుచున్నారు.

అక్టోబరు 25 నుండి 30 వరకు కాకినాడలో ప్రీచర్స్ వర్కుషాపు మరియు సువార్త కూటములు జరిగాయి. దీనిలో అమెరికానుండి వచ్చిన జాన్ క్లోర్‌గారు, జూలియన్ రెనాల్డ్స్‌గారు, జేమ్స్ ఎల్. మేగారు మరియు ఎ.జె. హెండ్రిక్స్‌గారు వాక్యాన్ని ఉపదేశించారు. జాన్ క్లోర్‌గారు, మార్కుసువార్తను వచనములవారీగా బోధించి, యేసే దేవుని కుమారుడను వాస్తవమును లేఖకుడగు మార్కు ఎంత ఘనముగా వక్కాణించాడో చక్కగా ఉపదేశించిరి. జూలియన్ రెనాల్డ్స్‌గారు కొలస్సయులకు వ్రాసిన పత్రికను వివరించారు. దానిలోని లోతైన భావములను ఆశ్చర్యకరమైన రీతిగా బోధించారు. మానవ తత్వజ్ఞానమును, నిరర్థకమైన మానవ కల్పిత ఆచారములను విసర్జించి సంఘమునకు శిరస్సైన క్రీస్తును హత్తుకోవాలని ఆయన ఉపదేశించారు. సంఘ నాయకత్వము, నడిపింపును గూర్చి జేమ్స్ మేగారు వివరించారు. మరియు క్రీస్తు సంఘముయొక్క విశిష్టతనుగూర్చి ఎ.జె. హెండ్రిక్స్‌గారు గొప్ప ప్రసంగములు చేసారు. ఏస్థానిక సంఘమైనను బలమైన సంఘముగా యుండాలంటే ఆ సంఘ సభ్యులలో ప్రేమ, ఏకత్వము ఉండాలని, కష్టపడి ప్రభువుకొరకు పని చేయాలని వారు హెచ్చరించారు.

ఈ పత్రిక సువార్తికుల సదస్సుకు పలు జిల్లాలనుండి, ఒరిస్సా నుండి కూడ సహోదరులు హాజరయ్యారు. ఐదు దినములలోను పై నుదహరించిన అమెరికా సోదరులు ఒక్కొక్కరు పదేసి పాఠములను దైవగ్రంథమునుండి ఉపదేశించారు. పాల్ కూపర్ గారు, జిమ్ ట్రోటరు గారుకూడ ఈ సదస్సుకు హాజరై సహోదరులను ప్రోత్సహించారు. ఈ సదస్సు జయప్రదంకావటానికి జాషువాగారు చక్కని ఏర్పాట్లు చేసారు. ప్రతిదినము ఇంచుమించు మూడు వందలమంది సువార్తికులకు చక్కటి భోజనం, వసతి లభించేలాగున ఆయన కృషి చేసారు. కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ విద్యార్థులు అన్ని విధముల సహకరించి సహోదరులను పరామర్శించేవారు. ఇంచుమించు ప్రతి రాత్రి వివిధ గ్రామాలలో సువార్త ప్రకటించు నిమిత్తము విదేశ సువార్తికులతో జాషువా గారు వెళ్ళేవారు. తత్ఫలితముగా 48 మంది క్రీస్తులోనికి ఆయా చోట్ల బాప్తిస్మము పొందిరి.

నవంబరు నెల సువార్తికుల సదస్సు 24వ తేదీ బుధవారం పాలకొల్లు క్రిస్టియన్ పేటలో జరుగును. అక్కడ సోదరులు జి. పడ్రిక్ గారు క్రీస్తుకొరకు పనిచేయుచున్నారు. ★

---

Regd. No. H/KD—45/KD H.O

From
SATYA VAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To

..............................
..............................
..............................
..............................